అంతర్గత రోడ్లు అధ్వానం

- రాకపోకలకు కాలనీల ప్రజల అవస్థలు
- పట్టించుకోని ఇంజినీరింగ్ అధికారులు



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని ఓ కాలనీలో గుంతలు పడ్డ రోడ్డు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో ప్రధాన రోడ్లనే మెరుగులు దిద్దుతున్నారే తప్పా కాలనీల్లోని అంతర్గత రోడ్లను ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వేసిన రోడ్లనే వేస్తున్నారని, చాలా కాలం క్రితం వేసిన రోడ్లు గుంతలు పడి అధ్వానంగా ఉన్నా అధికారులు అటు వైపు చూడటం లేదని పలువురు కాలనీల వాసులు వాపోతున్నారు. ముఖ్యంగా నాగోలు మన్సూరాబాద్, హయత్‌నగర్, లింగోజిగూడ, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని కాలనీల అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించడం, తిరిగి రోడ్లు వేయించడం చేస్తున్న ఉన్నతాధికారులు కాలనీల్లోని రోడ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పాడైన రోడ్లకు కనీసం మరమ్మతులు కూడా చేయడం లేదని పలువురు అంటున్నారు. గుంతల వల్ల ప్రతి రోజూ వాహనదారులు ఇబ్బందులు పడక తప్పడం లేదని స్థానికులు చెప్తున్నారు. ఏళ్ల క్రితం వేసిన రోడ్లను పునర్నిర్మించాలనే ఆలోచన లేకపోవడం విడ్డూరంగా ఉందని అధికారులతో పాటు ప్రజా ప్రతినిధుల తీరుపై పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కాలనీలో గుంతలు పడి, కంకర తేలిన రోడ్లకు వెంటనే ప్యాచ్ వర్క్ చేయించాలని లేదా.. కొత్తగా రోడ్లు వేయించాలని పలువురు కోరుతున్నారు.

కనీసం ప్యాచ్ వర్క్ చేయాలి

గుంతలమయంగా మారిన రోడ్ల స్థానంలో అధికారులు కొత్త రోడ్లు వేయించికపోయినా కనీసం ప్యాచ్ వర్క్ అయినా చేయాలి. ఈ రోడ్లపై వాహనాలను నడపాలంటే నడుము నొప్పి వస్తోంది. అంతే కాకుండా వాహనాలు తరచూ రిపేర్‌కు వస్తున్నాయి. అధికారులు స్పందించి వెంటనే గుంతలను పూడ్చాలి.

– సాయి, బీఎన్‌రెడ్డినగర్

డ్రైనేజీ పైప్‌లైన్ డయా సైజ్ పెంచాలి: ఎమ్మెల్యే



విజయవాడ జాతీయ రహదారి వద్ద రోడ్డు వెడల్పు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: రాబోయే రోజుల్లో అన్ని చోట్లా బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జరుగుతాయని, ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఒక అడుగు స్థానంలో రెండు అడుగుల డయా సైజ్ డ్రైనేజీ పైప్‌లైన్లు వేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ రహదారి వెడల్పు పనుల్లో భాగంగా ఎంఈ రెడ్డి గార్డెన్స్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రోడ్డు వెడల్పులో భాగంగా ఇక్కడ ఉన్న భూగర్భ డ్రైనేజీని తొలగించారని, దీని స్థానంలో ఒక ఫీట్‌తో డ్రైనేజీ పైప్‌లైన్ వేయడం వల్ల ఇబ్బందులు వస్తాయన్నారు. ఇదే సమయంలో పనుల పరిశీలనకు వచ్చిన జీహెచ్‌ఎంసీ ఎస్‌ఈ ధర్మారెడ్డికి ఎమ్మెల్యే పనుల విషయాన్ని వివరించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి భవిష్యత్‌లో ఉత్పన్నమయ్యే సమస్యలను వివరించారు. వరద నీటి కాలువ వెడల్పు రెండు మీటర్లు ఉండాలని మ్యాన్‌హోళ్ల సైజ్ పెంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, టంగుటూరి నాగరాజు, ప్రవీణ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, భాస్కర్ యాదవ్, ఆనంద్‌కుమార్, ధన్‌పాల్, శ్రవణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి



డాక్టర్ శైలజకు జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల సెక్రటరీ ప్రొఫెసర్ సుధ

సైదాబాద్: విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి వినూత్న సాంకేతిక ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని జేఎన్‌టీయూహెచ్ పరీక్షల అదనపు కంట్రోలర్ డాక్టర్ ఎం.శైలజ ఆకాంక్షించారు. ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలోని భోజిరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జిజ్ఞాస-2024 పేరుతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవాల ముగింపు వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన 1073 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతికతలో పలు అంశాలపై తమ నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభతో సాంకేతిక విప్లవంలో పెను మార్పులు చోటుచేసుకోవడం అభినందనీయమన్నారు. ఇంజినీరింగ్ చదివే సమయంలోనే విద్యార్థులు ఇంజినీరింగ్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలను అవపోషణ పట్టాలని సూచించారు. జిజ్ఞాస-2024 వేడుకల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు ఆమె ప్రశంస పత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. అనంతరం డాక్టర్ శైలజకు కళాశాల సెక్రటరీ ప్రొఫెసర్ సుధ జ్ఞాపికను బహూకరించారు. కళాశాల సీఓఓ డాక్టర్ సుజాత గంగాధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ గ్రేసీ శైలజ, మాధవన్, దయాకర్, ప్రోగ్రాం కన్వీనర్ మంజుభార్గవి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక సంతృప్తి

బ్రహ్మర్షి చాగంటి కోటేశ్వరరావు

సైదాబాద్: ఆధ్యాత్మిక చింతనతో అనేక సమస్యలను పరిష్కరించుకోవచ్చని, మానసికంగానూ ఎంతో సంతృప్తి లభిస్తుందని బ్రహ్మర్షి చాగంటి కోటేశ్వరరావు ప్రవచించారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్-బీ కాలనీలోని కోదండ రామాలయం ఆవరణలో మంగళవారం సాయంత్రం ఆయన శ్రీరామాయణ వైభవంపై భక్తులకు ప్రవచనాలు వినిపించారు. ఎస్‌బీహెచ్ కాలనీ సహా పరిసర కాలనీవాసులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రామాయణం యొక్క ప్రాశస్త్యం గురించి ఆయన కళ్లకు కట్టినట్లు వివరిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక సంతోషాన్ని కలిగించారు. రామయణ గ్రంథం బోధనలను ఆచరించాల్సిన ఆవశ్యకత గురించి ఆయన చక్కగా వివరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, గురువారం వరకు మూడు రోజుల పాటు కోదండ రామాలయం ఆవరణలో చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం సాయంత్రం 6 నుంచి రెండున్నర గంటల పాటు ఉంటుందని తెలిపారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళి



చింతలకుంటలో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, వేములయ్యగౌడ్



ఎల్‌బీనగర్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నేతలు

మన్సూరాబాద్: బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314వ వర్ధంతిని ఎల్‌బీనగర్‌లో పలు ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించారు. అఖిల భారత గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్య గౌడ్ ఆధ్వర్యంలో చింతలకుంటలోని ప్రలవి గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాష్ గౌడ్, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ చైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, ఎల్‌బీనగర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వర్‌రావుగౌడ్, నాయకులు మిద్దెల మల్లేశంగౌడ్, ముద్దగాని నగేష్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, కొండ గిరిగౌడ్, భీమగాని మంజులగౌడ్, ప్రశాంతిగౌడ్, సుభాషిని గౌడ్, నళినిగౌడ్, దీపాదేవిగౌడ్ పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌లో...

బీజేపీ ఎల్‌బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ గౌడ సంఘం నేతలు మంగళవారం ఎల్‌బీనగర్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు మల్లేష్‌గౌడ్, గణేష్‌గౌడ్, కిషోర్‌గౌడ్, రఘుగౌడ్, వెంకటరమణగౌడ్, కిషన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి నాగోలు సీతారామచంద్ర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ, ఆలయ కమిటీ సభ్యులు

నాగోలు: నాగోలు గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ తెలిపారు. సీతారామచంద్ర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను మంగళవారం నాగోలులోని శ్రీవేణుగోపాల అష్టలక్ష్మి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం మాట్లాడుతూ, నాగోలు గ్రామంలో దశాబ్దాలుగా సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వేలాదిమంది భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఐదు రోజుల పాటు ఉత్సవాలను వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. 17వ తేదీ (బుధవారం) కల్యాణ మహోత్సవం రోజున వేలాదిమంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయం డైరెక్టర్లు ఇంద్రాల ముత్యాల గౌడ్, పల్లె సీతారాములు గౌడ్, వస్పరి శంకర్ కురుమ, గోల్కొండ మైసయ్య, సిద్దాల దానయ్య, కట్ట ఈశ్వరయ్య గౌడ్, కోలన్ నరసింహ గౌడ్, నాగోల్ సుధాకర్ చారి, చింతల రవీంద్రనాథ్ యాదవ్, అనంతుల శ్రీనివాస్ రెడ్డి, చెరుకు ప్రశాంత్ గౌడ్, బద్దం రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింద తెలిపిన ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 8 నుంచి 9 గంటల వరకు... ఐబీపీ పెట్రోల్ బంక్, ఐఎస్‌సదన్ క్రాస్ రోడ్, 7బీ గ్రౌండ్, న్యూ ఐఎస్‌సదన్ పోలీస్ స్టేషన్, పూర్ణోదయా కాలనీ, పూర్ణోదయా కాలనీ పార్క్ పరిసర ప్రాంతాలలో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాట 17, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 35, క్యాబేజీ 18, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 19, దొండ 19–23, చిక్కుడు 35–50, గోకర 23, బీట్‌రూట్ 19. క్యాప్సికం 65, ఆలు 31, దోస 16, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 35. బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేయించండి

నాగోలు: కాలనీలో డ్రైనేజీ కోసం తవ్విన రోడ్డులో వెంటనే ప్యాచ్ వర్క్ పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. మంగళవారం కొత్తపేట డివిజన్ పరిధిలోని శ్రీ రామలింగేశ్వర కాలనీ రోడ్ నెంబర్ 3-4లో కార్పొరేటర్ పవన్‌కుమార్ పర్యటించారు. కాలనీలో కొన్ని రోజుల క్రితం నూతన భూగర్భ డ్రైనేజీ లైన్లు వేయడంతో రోడ్డు గుంతలమయంగా మారిపోయిందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత జలమండలి అధికారులు, డీజీఎంతో కార్పొరేటర్ మాట్లాడి వెంటనే కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు గుంతలకు ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేయించాలని కోరారు. స్పందించిన వారు సమస్యను పరిశీలించి డ్రైనేజీ పనులు పూర్తి చేసిన చోట ప్యాచ్ వర్క్ చేయిస్తామని తెలిపారు. కాలనీ అధ్యక్షుడు సుధాకర్,యాదయ్య, ఈశ్వర్ ల్, రాజ్ కుమార్, నాయకులు మంచి రాజేష్, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.



ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ప్రమాదాలకు నెలవుగా మ్యాన్‌హోళ్లు

- నాసిరకంగా ఉండటంతో కొద్ది రోజులకే ధ్వంసం
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు



ఎన్‌టీఆర్‌నగర్‌లో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

దిల్‌సుఖ్‌నగర్: మ్యాన్‌హోళ్లు ప్రమాదాలకు నెలవుగా మారాయి. కాలనీల్లో మ్యాన్‌హోళ్ల నిర్మాణాలు సరిగ్గా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నాణ్యత లేకపోవడంతో వేసిన కొద్ది రోజులకే ధ్వంసమవు తున్నాయి.

- ఆర్‌కేపురం డివిజన్‌లో కొన్ని నెలల కిందటే వేసిన మ్యాన్‌హోళ్లు నాసిరకంగా ఉండటంతో, చెడిపోయి ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి.
- అధికారుల పర్యవేక్షణ కొరవడి మ్యాన్‌హోళ్ల పరిస్థితి అధ్వానంగా తయారయ్యాయి. పాడైన మ్యాన్‌హోళ్లు రాకపోకలకు ఇబ్బందిగా మారినా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదంటున్నారు.
- నాణ్యతలేని కారణంగా ఇటీవల మరమ్మతులు చేపట్టిన ఎన్‌టీఆర్‌నగర్, అల్కాపురి, మార్గదర్శికాలనీ తదితర కాలనీలో మ్యాన్‌హోళ్లు కూడా పాడై రోడ్డు లోపలికి కృంగిపోతున్నాయి. దీంతో వాహనదారులు, పాద చారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి మ్యాన్‌హోల్ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.


ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి



అలాక్ కాలనీలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని అలాక్ కాలనీలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల అభివృద్ధి సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వాటిని పకడ్బందీగా అమలు పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. అనంతరం ముస్లింలకు కార్పొరేటర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మతపెద్దలు, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



దీపక్‌రాజ్‌ను సన్మానిస్తున్న ఎల్‌బీనగర్ క్రైస్తవ దైవజనులు

మన్సూరాబాద్: క్రైస్తవ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, క్రైస్తవులందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనార్టీ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ కోరారు. కార్పొరేషన్ చేపడుతున్న సంక్షేమ పథకాలపై మంగళవారం ఎల్‌బీనగర్‌లోని సియోన్ బాప్టిస్ట్ చర్చిలో నియోజకవర్గంలోని క్రైస్తవ దైవజనులు, పెద్దలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై దీపక్‌జాన్ మాట్లాడుతూ, క్రిస్టియన్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్య, వైద్యంతో పాటు అనేక పథకాలను కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తోందని తెలిపారు. కార్పొరేషన్ ద్వారా ఏ విధంగా సంక్షేమ పథకాలు పొందాలో ఆయన వివరించారు. అనంతరం దీపక్‌జాన్‌ను క్రైస్తవ దైవజనులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డా.బిషప్ పి. సాల్మన్ జోబ్స్, పాస్టర్ జానకీ రయ్య, పాస్టర్ ప్రకాష్‌పాల్, పాస్టర్ పాలు రాజ్, దేవుని సేవకులు పాల్గొన్నారు.

కనులపండువగా వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధి విజయశ్రీకాలనీలోని పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డిలు మంగళవారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉ.9 గంటలకు యాగశాల ప్రవేశం, హోమం, ధ్వజారోహణం, సాయంత్రం 6 గంటలకు మన్యుసూక్త హోమం, దేవతాహ్వానం కార్యక్రమాలను నిర్వహించారు. జగదీష్‌యాదవ్, నాగరాజు, మోహన్‌రెడ్డి, రాజేష్, నర్సిరెడ్డి, రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, లోకేశ్వర్‌గౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, మర్రి కిషన్‌రెడ్డి, కొండల్‌రావు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

డివిజన్ పరిధి ఆదిత్యానగర్ కాలనీలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం 8 గంటలకు విష్వక్సేనారాధన, సాయంత్రం 5.30గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం రాత్రి 8.30 గంటలకు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ దేవనాథ జీయర్‌స్వామి చేతుల మీదుగా ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠాన జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన దంపతుల అరెస్టు

పరారీలో కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి

నాగోలు: నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్ కాలనీకి చెందిన బాలవర్ధన్ రెడ్డిని డబ్బుల విషయంలో వేధింపులకు గురిచేసి అతడి ఆత్మహత్యకు కారణమైన దంపతులను నాగోలు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్, వివేకానంద నగర్‌కు చెందిన ముదావత్ భాగ్యలక్ష్మి, ముదావత్ రవికుమార్ భార్యాభర్తలు. కారు కొనుగోలు కోసం వీరు బాలవర్ధన్ రెడ్డికి నగదు ఇచ్చారు. ఈ విషయమై భాగ్యలక్ష్మి, ఆమె భర్త రవికుమార్, గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డిలు వేధింపులకు గురి చేయడంతో గత నెల 31న బాలవర్ధన్ రెడ్డి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నాగోలు పోలీసులు డబ్బు విషయమై బాలవర్ధన్‌రెడ్డిని వేధింపులకు గురి చేసిన భాగ్యలక్ష్మి, ఆమె భర్త రవికుమార్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి పరారీలో ఉన్నాడని, అతని త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

అర్ధరాత్రి పోకిరీల ఆగడాలు



శ్రీనగర్ కాలనీ రోడ్డులో అర్ధరాత్రి వేళ తిరుగుతున్న పోకిరీలు

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ శ్రీనగర్ కాలనీలో పోకిరీల ఆగడాలు అధికమయ్యాయని కాలనీ వాసులు అంటున్నారు. క్రోమా బిల్డింగ్ వద్ద నుంచి గాంధీ విగ్రహం వరకు అర్ధరాత్రి వేళ ఎక్కడి నుంచో బైక్‌లపై ఇక్కడకు వచ్చి ఫుట్‌పాత్‌లపై కూర్చొని మద్యం, సిగరెట్లు తాగుతూ స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నారని అంటున్నారు. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పక్క సందులో ఉన్న కాలనీ రోడ్డులో పోకిరీలు అర్ధరాత్రి వేళ ఇష్టారాజ్యంగా తిరుగుతూ, గొడవలు పడుతూ తమకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పోకిరీల ఆగడాలతో రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే బయపడే పరిస్థితి నెలకొందని అంటున్నారు. పోలీసులు స్పందించి తమను ఇబ్బందులకు గురి చేస్తున్న పోకిరీల ఆటకట్టించాలని శ్రీనగర్ కాలనీవాసులు కోరుతున్నారు.

ఘనంగా ధన్వంతరి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజల్లో పాల్గొన్న డాక్టర్ గొల్లూరి రమేష్‌సాగర్ తదితరులు

మన్సూరాబాద్: డివిజన్‌లోని హయత్‌నగర్ పరిధి వినాయక్‌నగర్ కాలనీలోని భారతీయం సంస్థ ఆధ్వర్యంలో వివేకానంద మెడికల్ సెంటర్‌లో ధన్వంతరి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం నిత్యహోమం తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భారతీయం చైర్మన్, వివేకానంద మెడికల్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ గొల్లూరి రమేష్‌సాగర్, గణేశ్ సాగర్, గంట రవికుమార్ రాసాల మహేశ్, కల్లెట్ల నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ పేరుతో వసూళ్లు

- ఇద్దరు వ్యక్తుల అరెస్ట్
- నిందితుల్లో ఒకరు ఏఆర్ కానిస్టేబుల్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

చైతన్యపురి: ఏసీబీ అధికారుల పేరు చెప్పి అమాయకులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఒకరు ఏఆర్ కానిస్టేబుల్ కావడం గమనార్హం. మంగళవారం సాయంత్రం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు కేసు వివరాలు వెల్లడించారు. చైతన్యపురికి చెందిన ప్రసాద్‌బాబు పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో ట్రెజరర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల ఓ వ్యక్తి అతడికి ఫోన్ చేసి త్వరలో నీపై ఏసీబీ రైడింగ్ జరుగుతుందని, తనకు రూ. లక్ష ఇస్తే దాడి జరగకుండా చూస్తానని చెప్పాడు. నగదు తీసుకుని బంజారాహిల్స్ ఏసీబీ ఆఫీస్ వద్దకు రావాలని సూచించాడు. అది ఫేక్ కాల్‌గా గుర్తించిన ప్రసాద్‌బాబు ఆదివారం చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు మహబూబ్‌నగర్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పనిచేసే ఏఆర్ కానిస్టేబుల్ అమ్మె మల్లేష్, అతడి అనుచరుడు రాపోలు అనిల్ కుమార్‌లుగా గుర్తించి మంగళవారం కర్మన్‌ఘాట్ ప్రాంతంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో వారు అంగీకరించారు. బాధితుల్లో ఓ డీఎస్పీ, ఆర్ఐ, హార్టికల్చర్ అధికారి, వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ ఉండటం గమనార్హం. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

న్యాయవాదుల ఆరోగ్య బీమా రూ.2.50 లక్షలకు పెంపు

రంగారెడ్డి కోర్టులు: న్యాయవాదుల పరస్పర సహకార సంఘం కార్యవర్గ సమావేశం మంగళవారం సంఘం అధ్యక్షుడు అనిల్ కుమార్ ఆళ్లగడ్డ నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా సభ్యులకు అందించే ఆరోగ్య బీమాను రూ. 2 లక్షల 50 వేలకు పెంచినట్టు సంఘం సంచాలకుడు బాచిరెడ్డి శాయి రెడ్డి తెలిపారు. సంఘంలో సభ్యత్వం పొందిన సుమారు ఆరు వేల మంది న్యాయవాదులకు ఈ బీమా సదుపాయం వర్తించనుందని ఆయన తెలిపారు. దీంతో పాటు పేద న్యాయవాదులకు సంఘం అందించే అంత్యక్రియల ఖర్చును కూడా రూ.50 వేలకు పెంచామన్నారు. సంచాలకుడు కాటంగురి బుచ్చిబాబు, శ్రీనాథ్, రాజీవ్ రెడ్డి, న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణ పాల్గొన్నారు.